పెద్దకథ

# అనితరసాధ్యుడు

రంగనాయకమ్మ

ఆ సాయంత్రం వంట వేనే చేస్తానని ప్రకటించింది నిర్మల.

"బతికించావు తల్లీ! ఈ పాడువంట ఈ జన్మానికి తప్పుతుందా లేదా అని చూస్తున్నాను. శెలవలు రాగానే పిల్లలు అమ్మదగ్గరికి వెళ్ళిపోయాక మూడొంతులు చాకిరీ తప్పింది. ఈ మొగుడు చాకిరీ ఎప్పుడు తప్పుతుందా అని చూస్తున్నాను శెలవులన్నాళ్ళూ నువ్వేచెయ్యి."

"శెలవులన్నాళ్ళూ యేవిటి? తర్వాత నే నెక్కడికిపోతాను? వెళ్ళవలిసింది నువ్వే."

"గెలుపు సాధించకముందే యెందుకా గొప్పలు? మరి నేను పోనా? హాయిగా స్నానంచేసి కూర్చుని పుస్తకం చదువుకొంటాను."

"ఆఁ చదువుకో" అని నిర్మల దోసకాయలూ కత్తిపీటా ముందేసుకూర్చుంది. ఏం చెయ్యాలో తెలీలేదు. నిర్మలకి వంటింట్లో ముక్కూ మొహం తెలీదు.

"దోసకాయపచ్చడి నాకు రాదే విమలా!" అని కొంచెం దిక్కుమొహం వేసింది.

"చెప్పమంటే చెపుతాను. చెప్పనా?"

"ఆ పచ్చట్లో నీ పోలికలుంటే?"

"అయితే మా పక్కింటివాళ్ళనడుగు."

"మీ విమల్నే అడగరాదా అని వాళ్ళంటే? సరేలే నువ్వేచెప్పు. నీ పోలికలూ, జ్ఞాపకాలూ రాకండా నేనోపని చేస్తాలే."

"వుప్పెక్కు వేస్తావు గావును. ఎంత రుచి లేకపోయినా తింటాడుగానీ, ఒక్క ఉప్పుగల్లు యెక్కువైందంటే పాపం చాలా యిబ్బందిపడిపోతాడు బుచ్చిబాబు."

"ఆ మాత్రం తెలుసులే. ఎవరైతే మాత్రం వుప్పెక్కువైతే తింటారేవిటి? సరేలే చెప్పు. పచ్చడి సూత్రం ఏవిటి? ధనియాలూ, మెంతులూ, మిరపకాయలూ ఏ నిష్పత్తిలో వెయ్యాలి?"

"ఒకటీ ఉస్తూ రెండూ ఈస్తూ మూడూ."

"సరిగ్గా చెప్పావా? చిన్నపిల్లని మోసం చెయ్యకూడదు."

"అయితే నన్నడక్కు పో."

"నా ఇష్టం వచ్చినట్టు మారుస్తాలే. నిన్నెవడు నమ్మాడు? ఇక నువ్వెళ్ళు బైటికి" అని విమల్ని గెంటేసి వంటగది తలుపులు వేసేసుకుంది నిర్మల.

విమల స్నానం చేసి తల దువ్వుకుని పడగ్గదిలో చదువుకుంటూ కూర్చుంది. రెండు గంటలయ్యాక హఠాత్తుగా గుర్తొచ్చి దీని పచ్చడి మండా! ఇంకా రాదేం? అనుకుంటూ వెళ్ళి వంటగదిలోకి తొంగి చూసింది.

నిర్మల అప్పుడే పచ్చడి గిన్నెలోకి తీసి రోలు కడుగుతోంది. తలుపుల మధ్య విమల మొహం చూసి "అయిపోయిందే. కొంచెం రుచి చూడు ఎలాగుందో" అని చెంచాడు దోసలేహ్యం తెచ్చి విమల చేతికి పామింది.

విమల కుతూహలంగా చేతిలో లేహ్యం నాకి కళ్ళు తేలేసి నోరు నొక్కుకుని వాకిట్లోకి పరిగెత్తింది. చేదుపుట్ట! దోసకాయలు చేదు చూడలేదన్నమాట పిచ్చిమొద్దు! చెక్కు తియ్యలేదు. ధనియాలో సోలెడూ, మిరియాలో సోలెడూ పోసేసినట్టుంది. అన్నీ కలేసి రెండు గంటలు రుబ్బింది. ఈ ముద్ద తీసుకుపోయి బుచ్చిబాబుకి పెడుతుందిగావును. పాపం ఎలా తింటాడో!.... ఏం తింటాడు? వాడి లేస్తాళ్ళే.

"ఏవిటే, చెప్పకుండా పరిగెత్తావూ?" అని నిర్మల అరిచింది.

"బాగనే చేశావే! ఆశ్చర్యంగా వుంది! ఇలాంటి రుచి వొస్తుందనుకోలేదు నేను."

"మరేవిటనుకున్నావ్? నేనేపనిచేసినా అంతే. వంట కమ్మగా చెయ్యాలంటే పదే పేళ్ళు వంటింట్లో నానాలేవిటి? మా అమ్మని చూస్తే వొళ్ళుమంట నాకు. వంటింట్లోంచి వూడిరాదు ఎప్పుడూ." అని పెద్ద వుపన్యాసం ఒకటి ఇచ్చింది.

"రెండురోజులు వంటచేస్తే చాలు. నువ్వు మీ అమ్మని మించిపోతావే" అని విమల అభినందించింది.

నిర్మల పొంగిపోయే వుత్సాహంతో బుచ్చిబాబుకి స్పెషల్‌గా భోజనం వొడ్డిస్తానని వంటిల్లంతా నీట్‌గా సర్దింది.

"విమలా! నువ్వూరా" అని బుచ్చిబాబు పిలిస్తే.

"నా కాకల్లే దిప్పుడు. నేనూ, నిర్మలా తర్వాత తింటాంలే. ముందు నువ్వు తినెయ్యి. నేను చదువుకుంటున్నాను" అని విమల కుర్చీ యెక్కింది.

నిర్మల చిరుచిరు నవ్వులతో వడ్డించింది బుచ్చిబాబుకి. "ఇవి చాలా యిష్టమని వేనే చేశాను. బావా ఈ పచ్చడి నేనెప్పుడూ వంటచెయ్యలేదుగానీ. నేర్చుకోడం యెంతసేపు మనసుపెట్టి చేస్తే? ప్రేమించిన వాళ్ళకోసం పచ్చడి చెయ్యాలంటే...." అని యేవిటేవిటో మాటలు



గుమ్మరిస్తూ రెండు గరిట్ల దోసముద్ద వేసింది.

బుచ్చిబాబు వుత్సాహంగా కలుపుకుని గుండ్రాయంత ముద్ద ఎత్తి నోట్లోకి పంపించాడు. కళ్ళు తేలేసి మొహం బిగించి నిర్మలకేసి చూశాడు

"బాగుందికదూ బావా! నేనేచేశాను నీకెంతో యిష్టమనీ."

బుచ్చిబాబు ఆ గుండ్రాయిని శివుడు గరళం మింగినట్టు లోపలికి మింగేశాడు

"బాగుందమ్మా! చాలా బాగుంది "

"అమ్మా ఏవిటి? నిర్మలా అను. లేకపోతే నీరూ అను, లేకపోతే నీలా అను. మా కాలేజీలో ఒకబ్బాయి నన్ను.... ఆఁ, లేదులే. సరిలే ... పచ్చడి బాగుందా?"

"చాలా బాగుంది."

"రేపు చింతచిగురు పప్పొండుతా.... కాదు. కాదు.... చింతచిగురుకాదు... ఆఁ టమాటా.... టమాటా పప్పొండుతా. ఏం?"

"నీకెందుకు శ్రమ? చిన్నదానివి. ఏవన్నా నవలలు చదువుకో. విమల చూసుకుంటుందిలే. పోని విమలకి సాయం చెయ్యి."

మ్యాజిక్ బుక్ : అను మహా గారడిజాల రహస్యం. తంత్ర విద్యలు ఆశ్చర్యపడగల ఎన్నో ట్రిక్కులు వివరించబడినది నేర్చుకొనవచ్చును፧ పోస్టు ఖర్చుతో రూ. 5-50. కుట్టు పని స్వబోధిని : రకరకాల దుస్తులు స్వయంగా కత్తిరించి కుట్టు నేర్చుకొనవచ్చును చిత్రపటములతో పోస్టు ఖర్చులతో రూ. 7-50 వర్తక రహస్యములు : సోప్సు, సిరా దినుసులు, అగరవత్తులు, పళ్ళపొడి, హెయిరాయిలు, అత్తరుచేయు రహస్యాలు వున్నాయి పోస్టు ఖర్చుతో రూ. 8-00. కొక్కోకము : (బొమ్మలతో) రూ. 5-50.

SRI DEVI BOOK DEPOT (J)
No-12. Saravana Mudali Street
Madras-1

శుభవార్త

వార్ధక్యము సాధ్యముకాక పతిర చేయబడిన అన్ని వ్యాధులు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహములోని అన్నివ్యాధులు తొలగి పోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

"నేను చిన్నదాన్నా? విమల నాకన్నా ఎంత పెద్దదేం మహా? ఆరేళ్ళేగా? నీకోసం వండాలంటే నాకేం కష్టంలేదు. కావాలంటే నా ప్రాణాలుకూడా ఇచ్చేస్తాను నీకు."

బుచ్చిబాబు నవ్వాడు- "ప్రాణాలిచ్చేస్తే నువ్వింక వుండవు"

"ప్రాణాలిచ్చెయ్యడం అంటే అచ్చంగా కాదు బావా! నేను బతికే వుంటానుగానీ నా ప్రాణాలు నీకేనన్న మాట"

బుచ్చిబాబు కలుపుకున్న వాయంతా కిక్కురుమనకుండా తినేశాడు.

"పచ్చడిమళ్ళీ వెయ్యనా బావా?"

"వొద్దులే నువ్వలా కూర్చో. నేను పెట్టుకుంటాలే" అని బుచ్చిబాబు అన్నం పెట్టుకుని పులుసుగరిటె తీసుకున్నాడు చేతిలోకి.

నిర్మల కోపంగా గరిటె లాగేసి తనే స్వయంగా పులుసు వొడ్డించింది. అది చూస్తున్న విమలనవ్వేసిందే.

పులుసన్నం తింటోంటే బుచ్చిబాబు మొహంలోకి ప్రశాంతత వొచ్చింది. సంతోషంగా భోజనం ముగించి లేచాడు.

గదిలోకి రాగానే విమల బుచ్చిబాబు మొహం కుతూహలంగా పరికించింది.

"దోసకాయపచ్చడి చాలా చేదుగావుంది విమలా! పాపం మీరెలా తింటారు? తినకండి. పారెయ్యండి. అన్నాల్లో కలుపుకోవొద్దు."

విమల నవ్వుతూ "చెప్పావా నిర్మలకి?" అంది.

"చెప్పలేదు. నువ్వుచెప్పు నెమ్మదిగా."

"చెప్పలేదా? మరి నువ్వు పచ్చడి వొదిలేస్తే యేమనుకుంది?"

"వదల్లేదుగా? తినేశాను. పాపం అంత సరదాపడి చేస్తే... "

"తినేశావా? అమ్మో! ఆ చేదుపుట్ట!"

"మరి పాపం ఏమనుకుంటుంది వదిలేస్తే?"

"అందుకనీ ... "

"విమలా! అన్నాలు పెట్టేశాను రావే" అని కేక పెట్టింది నిర్మల వంటింటోంచి.

విమల వంటింట్లోకివచ్చి పళ్ళెంచుట్టూ పొందిగ్గా సర్దిన గిన్నెలు చూసి "బుచ్చిబాబుకి సేవలు చెయ్యాలిగానీ నాక్కూడా ఎందుకే?" అని పీటమీద కూర్చుంది.

"నీక్కూడా సేవచేస్తే బావకి నామీద ప్రేమ వచ్చి నన్ను పెళ్ళి చేసుకోడూ?"

"ఆ సంగతి మీరూ మీరూ చూసుకోండి బాబూ" అంటూ విమల నవ్వాపుకుంటూ పచ్చడి కలుపుకోకుండా తాత్సారంచేసింది.

నిర్మల పచ్చడి ముద్ద నోట్లో పెట్టుకుందో లేదో నోట్లో తేలుకుట్టినట్టు కెవ్వున అరిచి వాకిట్లోకి పరిగెత్తింది. విమల పీట మీదనించి లేచిపోయి పడీ పడీ నవ్వడం మొదలుపెట్టింది.

నిర్మల కోపంగా బుచ్చిబాబు దగ్గరికి పరిగెత్తి- "ఎంటి బావా, మాటవరసకైనా అనలేదేం? దోసకాయపచ్చడి చేదుగా లేదూ?" అని అరిచింది.

"చేదా? నాకంత చేదుగా లేదే!"

"మంచివాడివే చేదుపుట్టలాగుంటే చేదు లేదా నీకు? ఏం నోరు బాబూ నీది? నాలిక పీకేసుకోవాలనిపిస్తోంది. అన్ని ముద్దలు ఎలా మింగావు? బాగానే వుంది నీతో."

"పోనీలే నిర్మలా. మీరు తినొద్దులే పారెయ్యండి"

"ఆ మాట నువ్వు చెప్పాలేమిటి? భలే వాడివి" అని రయ్యిన వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"భలే అయిందిలే అమ్మాయిగారికి" అని విమల మళ్ళీ గట్టిగా నవ్వింది.

నిర్మల పీటమీద కూర్చుంటూ—

"బావ ఎమిటీ అంత బండతనం?" అని విసుక్కుంది.

"పళ్ళు రాలగొడతాను. ఏమనుకున్నావో! నువ్వెంతో సరదాపడి చేశావని పాపం అతను అంత వోర్చుకుని తింటే బండతనంలాగ కనపడిందా నీకు? 'అంత చేదుపుట్ట ఎలా తిన్నాడో' అని జాలన్నా లేదుగాని బండతనం గిండతనం అని పేర్లెడతావా? దోసకాయలు చేదు చూడాలని తెలీదటే దున్నపోతా? బండతనం యెవరిదీ?"

"ఆఁ, నాకూ తెలుసులే అసలు బావని పరీక్షిద్దామని అలా వొండాను. పెళ్ళి చేసుకునేముందు పరీక్షించి చూసుకోవాలా, వద్దా?"

"ఏడిశావులే. బాగా అయిందిగా వ.... రీ... కు ఆదిలోనే హంసపాదన్నట్టు ఆరంభంలోనే గరళం పచ్చడి పెట్టావు. మహా చక్కగా ప్రేమిస్తాళ్ళే నిన్ను."

"అదుగో! దొరికావు, దొరికావు. వంటబాగా చేసిపెడితేనే ప్రేమిస్తాడు. లేకపోతే ప్రేమించడు. అంతేగా నీ అభిప్రాయం? వంట బాగాచేసి ప్రేమ సంపాయిస్తానంటె యిందాక నన్ను తప్పు పట్టావేం?"

"ఏడిశావ్లే వెధవ పాయింటు తీసావు"

"తప్పొప్పేసుకో" అంటూ నిర్మల పచ్చడిగిన్నె వాకిట్లోకి గిరాటుపెట్టింది.

* * *

రెండో రోజు సాయంత్రం బుచ్చిబాబు ఇంటికి వొచ్చేసరికి విమల లేదు. నిర్మల ఒక్కతే పడగ్గదిలో కూర్చుని చదువుకుం

బోంది. విమల చీరకట్టుకున్న తనవిచూసి బావ ఏమంటాడోనని ముసి ముసి నవ్వులతో ఎదురుచూస్తోంది.

బుచ్చిబాబు నిర్మలని విమలే అనుకుని "విమలా" అంటూ బాగా దగ్గరికివొచ్చి హఠాత్తుగా ఆగిపోయాడు. "నువ్వా నిర్మలా? విమలనుకున్నాను. విమలేదీ? ఎక్కడికి వెళ్ళింది? నువ్వెళ్ళలేదేం? ఏదీ విమల? ఎప్పుడొస్తానంది?" అని మూట పదహారు ప్రశ్నలు వేశాడు.

"ఎక్కడికో వెళ్ళిందిలే. లైబ్రరీకి కాబోలు. నన్ను రమ్మందిగానీ నేను రావన్నాను. నీకోసమే వెయ్యికళ్ళతో ఎదురు చూసున్నాను. నన్నుచూసి విమలని ఎందుకనుకున్నావో చెప్పు."

"విమల చీర కట్టుకున్నావుగా?"

"అమ్మో! నీకు ఏ చీర ఎవరిదో కూడా తెలుసుందే! మరి ఈ చీర కట్టుకుంటే నేను బాగున్నానా? విమల బాగుంటుందా? నిజం చెప్పాలి."

"నీకు నువ్వే బాగున్నావు. విమలకి విమలా బాగుంటుంది."

"అలాగ దాటేస్తే నేనొప్పుకోను ఎవరు అందంగా వున్నారో చెప్పాలి. నేను చిన్నప్పటి విమలలాగా లేనూ? నా పోలికలన్నీ విమల పోలికలేనంటారు మావాళ్ళు. మీ పెళ్ళప్పటికి విమల ఎలా వుండేదో సరిగ్గా అలాగ లేనూ నేను?"

బుచ్చిబాబు నవ్వి కొంచెం ఆలోచించాడు. "అవును, అలాగే వున్నట్టున్నావు. పెళ్ళప్పటి విమల్ని మరిచేపోయాను నేను. ఆలోచిస్తోంటే పొద్దున్నచూసిన విమలే గుర్తొస్తోంది."

"ఎప్పటిదప్పుడే తరగడువన్నమాట నీకు."

"లేకపోతే కళ్ళముందు సంగతులు వొదిలేసి వదేళ్ళో, పదిహేనేళ్ళో వెనక్కిపోయి ఆ విషయాలు తల్చుకుని సంతోషిస్తూ కూర్చుంటామా నిర్మలా? ఇప్పటి విషయాలకన్నా సంతోషంగా వుంటాయా పాత విషయాలు? అప్పుడు అదీ బాగుంది. ఇప్పుడు ఇదీ బాగుంది."

"నేన్నమ్మన్లే. అబద్ధాలాడుతున్నావు. విమల చిన్నప్పటి విమల్లాగే వుంటే నీకు సంతోషం కాదేమిటి? నన్ను చూడు. నేను చిన్న విమలలాగే వున్నాను. నా చేతులు చూడు తెల్లగా, పొడుగ్గా ఎంత బాగున్నాయో! నా కళ్ళు చూడు పద్మాల్లాంటి కళ్ళుకదూ? సంపెంగలాంటి ముక్కు!... ఇంకానేమో.... ఆఁ, నా జడ చూడు. ఎంత బాగుందో!"

"చాలా బాగుందిలే. కాఫీ పెట్టుకు తాగుదాం పద. నేను పెట్టిన కాఫీ నువ్వెప్పుడూ తాగలేదుగా?"

"ఇదుగో! ఇక్కడే పెట్టాను ఫ్లాస్కులో. చూశావా? ఎంత శ్రద్ధగా పెట్టానో నీకోసం?" అంటూ నిర్మల కాఫీ యిచ్చింది బుచ్చిబాబుకి.

"అవును, చాలా మంచిదానివి" అని బుచ్చిబాబు గ్లాసు తీసుకున్నాడు.


"అంతేనేవిటి? మంచిదానివి అంటే సరిపోతుందేవిటి? నువ్వు నాకు చాలా చాలా నచ్చావు అను."

"నచ్చడం అంటే?"

"నచ్చడం అంటే.... వూఁ.... నచ్చడం అంటే ముదురావడం నేను ముదొస్తున్నానా నీకు? నా చెయ్యి ముద్దు పెట్టుకో మరి."

"పిచ్చిపిల్లా! వూరుకో. నువ్వు కూడా






కాఫీతాగు, తర్వాత మాట్లాడుకుందాం."

"అదుగో నువ్వలా తీసేస్తే నే నొప్పుకోను. నేనేం చిన్నపిల్లననుకున్నావా? విమల నాకన్నా ఎంత పెద్దదేం మహా? ఐదేళ్ళేగా?"

"అది సరేగానీ. విమల అన్నం వొండేసి వెళ్ళిందా? మనల్ని వొండమని చెప్పిందా?"

"మనల్నిద్దర్నీ చక్కగా యేదన్నా సినిమాకి వెళ్ళమని మరీ మరీ చెప్పింది."

"అబద్ధాల పుట్టవి నువ్వు. విమలకి అసలు సినిమాలంటే వొళ్ళుమంట."

"విమలకి వొళ్ళు మంటయితే గంగలో దూకమను. నిన్ను నాతో సినిమాకి రమ్మంటాననుకో, వస్తావా రావా?"

"రేపు అందరం కలిసి వెళ్దాంలే. ఏం?"

"రేపొద్దు. ఇప్పుడే. మనిద్దరం సినిమాకి పోతున్నామని ఒక చీటీ రాసిపెట్టేసి వెళ్ళిపోదాం. పాపం విమల అది చూసుకుని...."

"అది సరేగానీ. బియ్యే అయ్యాక ఏం చేస్తావు?"

"గంతులేస్తాను. తెలిసిందా?"

"ఓహో! డాన్సు నేర్చుకుంటావా?"

"మాట తప్పించేస్తున్నావు. సినిమాకి వస్తావా, రావా?"

"నిన్ను దెబ్బలు కొడతాను నిర్మలా! నాకు చాలా కోపం తెప్పిస్తున్నావు.. పోనీ కదా పాపం చిన్న పిల్లవి అని వూరుకుంటూంటే నీ అల్లరెక్కువైపోతోంది." అని బుచ్చిబాబు నవ్వులో కోపం ప్రదర్శించాడు

నిర్మల ఇక లాభం లేదని నవ్వేసింది. "అది కాదు బావా! విమలా, నేనూ పందెం వేసుకున్నాం. విమల నిన్ను 'అనితర సాధ్య'డంది. అప్పుడు నేనేమో ..."

"ఏదో కోపంలో అలా తిట్టేసి వుంటుందిలే. విమల తిట్లు అంత పట్టించుకోకూడదు."

"తిట్టు కాదు బావా అదీ. గొప్ప పొగడ్త! అనితరసాధ్యుడంటే విమలకి తప్ప ఇతరులకు సాధ్యపడని వాడట. అప్పుడు నేనన్నానూ బుచ్చిబాబుని నిర్మలా ప్రియుణ్ణి కూడా చేసేస్తావన్నాను. వూరికే సరదాకి అన్నాలే. నాకు తెలీదేవిటి నువ్వెంత మంచివాడివో! విమల్ని ఏడిపిద్దాం బావా! ఒక్కసారి నువ్వు నన్ను విమలముందు-"నిర్మలా! నువ్వెంత అందంగా వున్నావో! నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అను. ఏం? వూరికే. సరదాకి. నిజంగా కాదు. వొట్టు! తర్వాత చెప్పేద్దాం. ఒక్కసారి విమల్ని ఏడిపించి...."

"ఛీ! వూరుకో!" అని మొహం చిట్లించాడు బుచ్చిబాబు. అంతలోనే కొంచెం నవ్వు తెచ్చుకుని-"ఏం ఆటలు చెప్పు. పిచ్చి ఆటలు!.... నీకేం వూసుపోడంలేదా? పాపం విన్నాక్క-దాన్నీ వొదిలేసి ఎందుకు వెళ్ళిందీ? పోనీ కాసేపు వైకుంఠపాళీ ఆడుకుందాంలా! విమల వొచ్చేదాకా...." అని నిర్మల్ని అనునయించబోయాడు.

"అదికాదు బావా! వూరికే సరదాకేగా? ఒక్కసారి సరదాకి అలా అంటే ఏం పోతుందమ్మా మరీనూ!"

"ఏం సరదా అది? చదువుకుంటున్నావు. ఎన్నో విషయాలు తెలివిగా మాట్లాడతావు. బావలకీ, మరదళ్ళకీ సరసాలుండాలేవిటి? పెళ్ళాన్నొదిలేస్తాననడం, మరదళ్ళని చేసుకుంటాననడం.... ఏం సరసాలవి? చీదర కాదూ? నా నోటికి రావు నిర్మలా అలాంటి మాటలు. సరదాకైనా సరే. నాకది బాగుండదు. బావలెవరైనా అలాంటి మోటు వేళాకోళాలు చేసే నువ్వసలు ఒప్పుకోకూడదు. అసలు విమలకి మతిలేదు. అస్తమానూ పిచ్చి పందేలు వేస్తుంది."

బుచ్చిబాబు మాటలు నిర్మల్ని ముగ్ధురాల్ని చేశాయి. బుచ్చిబాబు మంచివాడని తెలుసుగానీ. నిజంగా ఇంత మంచివాడని తెలీదు నిర్మలకి. బుచ్చిబాబు అలా అనడం చాలా నచ్చింది గాని. విమల్ని కాస్సేపన్నా ఏడిపించలేకపోయినందుకు విచారం పట్టుకుంది నిర్మలకి.

బుచ్చిబాబు మొహంలో గాంభీర్యం చూసి జంకి మళ్ళీ మాట్లాడకుండా వూరుకుంది. 'బావ సహకారం లేకుండా విమల్ని ఏడిపించేమార్గ మేదన్నా వుందా?' అనిదీర్ఘాలోచనలో మునిగిపోయింది.

"ఎందాకా వచ్చిందే నీ ప్రేమ కలాపం?" అంటూ వచ్చింది విమల రెండు బుట్టలనిండా సరుకులు కొనుక్కుని.

సరుకులన్నీ వంటింట్లో సర్దుతూ సంభాషణ కొనసాగించారిద్దరూ.

"నీ ప్రేమకలాపం ఏమిటి? మీ ప్రేమ కలాపం అను."

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, తెల్ల రంగుని మా ప్రత్యేక మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రతాక విఫలమైతే ఒక పేటా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!

దురభ్యాసములకులోనై దాంపత్య సౌఖ్యంపొందలేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధుల్కు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.
డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచి: మాన్యాడి గుడివద్ద, తెనాలి, ఫోన్: 561

"ఆ మాట బుచ్చిబాబు కూడా చెప్తే అప్పుడంటాలే"

"ఎందాకా వచ్చిందా? పాపం జవాబు వింటే ఏమైపోతావోనని జాలేస్తోంది. పెళ్ళిదాకా వచ్చింది."

"ఓహో! ఎప్పుడూ పెళ్ళి? ఈ జన్మ లోనే?"

"జన్మదాకా ఎందుకే? ఇవ్వాళే. ఇవ్వాళ నేను బావ గదిలోనే పడుకుంటాను. నన్నువద్దంటాడనుకుంటున్నావా?"

"బుచ్చిబాబు తొమ్మిది గంటలకే నిద్ర పోతాడు. తర్వాత నువ్వు పిల్లిలా గదిలో దూరి పడుకుంటే పాపం తనకేం తెలుస్తుంది?"

"అయితే బావ ఇంకా మెలుకువగా వున్నప్పుడే నేనా గదిలో ఒక మంచంమీద పడుకుంటాను. సరేనా?"

"ఓస్! అంతమాత్రాన బుచ్చిబాబు అంగీకరించినట్టేనా ఏవిటి? 'మన నిర్మలే కదా? నిద్రొచ్చేసి పడుకున్నట్టుందిలే' అనుకుంటాడు. అంతమాత్రాన నిన్ను ప్రేమించినట్టేనా?"

"బావ ముందే నేను నిన్ను 'విమలా! నువ్వింకో గదిలో పడుకో. నేనే ఈ గదిలో పడుకుంటా' అంటాననుకో- బావ మాట్లాడకండా వూరుకుంటా డనుకో. పోని ఆ నిదర్శనం చాలా? అప్పుడు నమ్ముతావా?"

"ఎడిశావ్‌లే వెయ్యిజన్మలెత్తు. అప్పుడు చూద్దాం."

"అదుగో. అదుగో ఓడిపోతున్నానని కుళ్ళు నీకు."

"విమలా! ఏవిటి మీ మాటలు?" అని బుచ్చిబాబు కోపంగా గదిలోంచి ఒక కేక పెట్టాడు.

"ఒక పవల్లో సంగతి చెప్పుకుంటున్నాం" అని విమల మళ్ళీ తిరుగు కేక పెట్టింది.

"నీ కసలు మతిలేదు విమలా!" అని బుచ్చిబాబు రెండో కేక పెట్టాడు.

"నిన్ను చేసుకున్నాక యింకెలా వుంటుందిలే" అని విమలకూడా రెండో కేక పెట్టింది.

ఆ కేకల సంభాషణ అయ్యాక కాస్సేపటికి అందరూ అన్నాలకి లేచారు.

భోజనాలయ్యాక బుచ్చిబాబు మళ్ళీ రాసుకుంటూ కూర్చున్నాడు. నిర్మల ఆ గదిలో తచ్చాడింది కాస్సేపు.

బుచ్చిబాబూ, విమలా పడుకునేమంచాలో ఒక మంచాన్ని దూరంగా కిటికీ దగ్గరికి ఈడ్చి. దానిమీదెక్కి పెద్ద దుప్పటి కప్పేసుకుని పడుకుంది. తను అలా చేస్తే




చాకలి రావడం లేదా?

వాషింగ్ మెషిన్ కొనండి

బట్టలు ఎక్కువ కాలం మన్నుతాయి.
కరెంటు ఖర్చు నెలకు రూ. 2-00 మాత్రమే.

సంప్రదించండి:

సోనో విజన్,

ఏలూరు రోడ్డు, విజయవాడ_2.

Suvarna

హార్స్‌లీ హిల్స్ స్కూల్

(హార్స్‌లీహిల్స్ పోస్ట్ చిత్తూరు జిల్లా ఆం. ప్ర)

ప్రవేశములు

ఈ స్కూలు పబ్లిక్ స్కూల్ ప్రమాణాలపై నడుస్తున్నట్టి. ఐ. పి. యస్. ఇ. కౌన్సిల్ న్యూఢిల్లీలో అనుబంధించబడిన రెసిడెన్షియల్ కో ఎడ్యుకేషనల్ స్కూల్ అయివున్నది. జనవరి 1981 నుంచి ఆరంభమయ్యే టరమ్‌లో I నుంచి IV వరకు తరగతులకు ప్రవేశంలు కొద్ది మాత్రమే వుండును. వివరాలకు దయచేసి సంప్రదించండి.

జస్టిన్ ఆంటోనీ, ప్రిన్సిపాల్.

నూతన సంవత్సర శుభాకాంక్షలు


పండుగలకు, శుభకార్యాలకు,
స్త్రీలకు కావలసిన మంగళకర వస్త్రాలు
మీ సౌందర్యానికి మరికొంత ఆకర్షణకు
సరిక్రొత్త డిజైనులు కొరకు దయచేయండి.

సుధా శారీ సెంటర్,

(స్త్రీల ప్రత్యేక వస్త్రాలయం)

మేనేజ్‌మెంట్ : గుర్రం వెంకటేశ్వర్లు సన్స్

ఖమ్మం.




విమలకి కొంచెమన్నా వుడుకుమోత్తనం వొస్తుందని నిర్మల నమ్మకం.

ఏం జరుగుతుందో చూద్దామని విమల వేరే గదిలో కూర్చుని పుస్తక పఠనంలో మునిగింది.


## తెలుగు పుస్తకాలు

| | |
|---|---|
| 150 కుటీర పరిశ్రమలు | రు. 10-00 |
| అతివినోద హాస్యకథలు | రు. 10-00 |
| కామసూత్రాలు | రు. 10-00 |
| దాంపత్య రహస్యాలు | రు. 10-00 |
| గర్భం-గర్భనిరోధం (బొమ్మలతో) | రు. 10-00 |
| ఇంగ్లీషు వైద్యం అన్ని రోగాలకి | రు. 25-00 |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

**ఉషా బుక్ సెంటర్,**

గాంధీనగరం, తాడేపల్లిగూడెం (A. P.)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిశారద్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము చేయుదా వేయ వలవదంలేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్ఖలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

**రావూస్ క్లినిక్**

డి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA


పగయ్యేసరికి బుచ్చిబాబు ఆవలిస్తూ "నిర్మళ్ని లేపుతావా విమలా?" అంటూ వొచ్చాడు.

"అక్కడ పడుకుందా?" అంది విమల తనకేం తెలీనట్టు.

"నిద్ర పట్టేసినట్టుంది పాపం" అన్నాడు.

"పోనీలే పడుకోనియ్యి. నిద్రపోయే దాన్ని లేపడం ఎందుకు? నీ మంచం నీకుందిగా? అది నీకేం అడ్డొచ్చింది"? అని విమల మళ్ళీ పుస్తకంలో మొహం పెట్టేసుకుంది.

వాళ్ళిద్దరూ ఒక గదిలో పడుకున్నా నిర్మల మీద ఈగన్నా వాలదని విమలకి గాఢనమ్మకం. ఆ సంగతి నిర్మలకి కూడా తెలిసి, తెల్లారి నిర్మల "బావ ఎంత మంచి వాడే!" అంటే చూడాలని విమల కుతూహలం.

బుచ్చిబాబు నిద్రమత్తులో వూగుతూ "విమలా! ఒకపని చేద్దాం. నేనీగదిలో పడుకుంటాలే. నువ్వెళ్ళి ఆ గదిలో పడుకో." అని మొరాయించి వించున్నాడు.

"ఈ మంచం చాలదు నీకు. మంచం చాలక తెల్లవార్లూ నిద్రపటలేదంటావు. మంచాలు ఇటూ, అటూ తిప్పడం ఎందుకు ఇప్పుడు? వెళ్ళి నీ మంచంమీద నువ్వు పడుకుందూ!.... చిన్నపిల్ల పడుకుంటె అంత బెదిరిపోతావేమిటి?" అని విసుక్కుంది విమల.

బుచ్చిబాబు మాట్లాడకుండా వెళ్ళి తన పక్క ఎక్కి రెండో నిముషంలో నిద్రపోయాడు.

విమల చాలా సేపటిదాకా చదువుతోనే వుంది. అప్పుడే ఇక పడుకుందామని లైటు తియ్యబోతుంటే నిర్మల గాలి దుమారంలా గదిలోంచి దూసుకొచ్చి "అయ్యబాబోయ్" అని అరుస్తూ విమల మీద పడింది. "ఎలా భరిసున్నావే ఈ మొగుణ్ణి? నాయనోయ్! నీకూ నీ మొగుడికీ వెయ్యి నమస్కారాలేవ్ హడలగొట్టి చంపేశాడేవ్" అని ఎగిరి బల్ల ఎక్కింది.

"ఏమైందే?" అని విమల తాపీగా అడిగింది.

"మొదట పిల్లులేమో అనుకున్నాను కాసేపు. తర్వాత ఏ మూలన్నా పాము జేరిందేమోనని హడలిపోయాను. తర్వాత భూతాలేమో ననుకున్నాను. ఆంజనేయుణ్ణి కూడా తలుచుకుని దణ్ణం పెటుకున్నానే. తగ్గితేనా? గదినిండా ఈలలు. వూళలు. బుసబుసలు, గుసగుసలు, బరబరలు, గురగురలు బాబోయ్! అదేం మొగుడేవ్! ఎల్లా భరిస్తున్నావేవ్ నీ పాతివ్రత్యం మండా! నేనైతే ఎప్పుడో వదిలేసి పారిపోదును. నాయనోయ్."

"బాగా గురక పెడుతున్నాడా? పాపం ఈ మధ్య ఒంట్లో బాగుండడంలేదే! ఎడినాయిడ్స్ పెరిగాయన్నారు." అంటూ విమల కంగారుగా బుచ్చిబాబు మంచం దగ్గరికి పరిగెత్తి ఒక నిమిషం నించుని చూసింది. తర్వాత వంటింటోకి వెళ్ళి ఒక గ్లాసుడు వేడినీళ్ళు కాగబెట్టి తెచ్చి ఒక మాత్ర తీసి "బుచ్చిబాబూ! బుచ్చిబాబూ!" అంటూ నెమ్మదిగా తట్టి లేపింది. "ఒక్కసారి లేచి మాత్రవేసుకో. సరిగ్గా ఊపిరాడక ఇబ్బందిపడుతున్నావు కొంచెం వేడినీళ్ళు తాగు"

బుచ్చిబాబు నిద్రమత్తులోనే లేచి మాత్ర మింగేసి, వేడి నీళ్ళు గటగటాతాగేసి మళ్ళీ వొరుగుతూ "నువ్వింకా పడుకోలేదా విమలా? తొందరగా ప.... డు.. కో" అంటూ మళ్ళీ నిద్రలోకి జారిపోయాడు.

అతనికి కొంత తేలిగ్గా వుండడంచూసి కాళ్ళమీద దుప్పటి కప్పి బయటికి వొచ్చింది విమల.

"బాబోయ్! అదేం మొగుడేవ్" అని నిర్మల ఇంకా వొణుకుతూనే వుంది.

"ఏడిశావ్లే. మనిషన్న తర్వాత జబ్బులురావా?" అని విమల నిర్మల నెత్తిమీద ఒక దిస్పకాయ తీసింది.

"వొస్తే వొదిలెయ్యాలి" అంది కోపంగా నిర్మల.

"మరి బుచ్చిబాబుని పెళ్ళిచేసుకుంటా నన్నావుగా?"

"నాకొద్దు బాబోయ్! నీ గురగుర మొగుణ్ణి నువ్వే వుంచుకో." అంటూ నిర్మల బల్లమీద నించి మంచంమీదకి దూకి దుప్పటి ముసుగెటేసుకుంది.

(ఇంకా వుంది)